సాక్షి ప్రకాశం

గురువారం । 17 । అక్టోబర్ । 2024



ఆక్రమణ పేరుతో కక్షసాధింపు

గిద్దలూరులో అధికార యంత్రాంగాన్ని ఉసిగొల్పి ఆక్రమణల పేరుతో వైఎస్సార్ సీపీ సానుభూతి పరుల చిరు దుకాణాలను కూల్చివేశారు.

- 8లో..



అప్పుల బాధతో ఆత్మహత్య

అప్పుల బాధ తాళలేక ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన దర్శి మండలం కొత్తపాలెం సమీపంలో బుధవారం జరిగింది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
26.7/24

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడుతుంది. ఈదురు గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మార్కాపురం జీజీహెచ్‌లో అంధకారం

- 8 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం
- చీకట్లోనే వైద్య సేవలు



జనరల్ వార్డులో చీకట్లో అవస్థలు పడుతున్న పేషంట్లు

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో బుధవారం అంధకారం నెలకొంది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వైద్యశాల ఆవరణలో ఉన్న విద్యుత్ వైర్లు తెగిపోవడంతో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు ఇబ్బంది పడ్డారు. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఇతర పరీక్షలకు చేయించుకునేందుకు కూడా వీల్లేకుండా పోయింది. చిన్నపిల్లల వార్డు, ప్రసూతి వార్డుల్లో కరెంట్ లేకపోవడంతో ఫ్యాన్లు తిరగక చంటిపిల్లలు, గర్భిణులు అవస్థలు పడ్డారు. రోగులకు కొవ్వొత్తుల వెలుగులోనే వైద్యసేవలందించారు. సాయంత్రం 5 గంటలకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈ విషయంపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రిని వివరణ కోరగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, సిబ్బందిని పిలిపించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు తెలిపారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ కార్యక్రమంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి ఎం.అంజల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వాల్మీకి సంఘ నాయకులు, బీసీ సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- కంట్రోల్ రూమును పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోలు రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: తుఫాన్ కంట్రోలు రూముకు వచ్చిన ప్రతి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన కంట్రోలు రూమును కలెక్టర్ పరిశీలించారు. అప్పటి వరకు వచ్చిన ఫోన్ కాల్స్ వివరాలను పరిశీలించారు. ఫిర్యాదులు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న విధానంపై ఆరాతీశారు. ఫిర్యాదుదారులతో కలెక్టర్ నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. సమస్యల పరిష్కారం, అధికారుల స్పందిస్తున్న తీరుపై ఆరా తీశారు. ఫోన్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ శ్రీలత, విపత్తుల నిర్వహణ విభాగం డీపీఎం మాధురి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

జల ఖడ్గం

- జిల్లాను వణికిస్తున్న వాయు 'గండం'
- మరో 48 గంటల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వాతావరణ శాఖ
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు
- కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ, ఎన్‌జీపాడుల్లో ఐదు రిలీఫ్ కేంద్రాలు



పామూరులోని సీఎస్‌పురం రోడ్డులో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



ప్రమాదకరంగా ఉన్న ఉప్పుగుండూరు చెరువు



సంకువారిగుంట వద్ద బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు

నైరుతీ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాపై జల ఖడ్గం వేలాడుతోంది. మంగళవారం రాత్రి నుంచి ఒంగోలు నగరంతో పాటు కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ, కొండపి మండలాల్లో భారీ వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా టంగుటూరు, కొండపి మండలాల్లో సుమారు 100 మి.మీ. పైగా వర్షపాతం నమోదైంది. చదలవాడ రామన్నచెరువు కట్ట తెగిపోయింది. చీరాల జాతీయ రహదారిపై మధ్యాహ్నం వరకూ రాకపోకలు స్తంభించిపోయాయి. ఉప్పుగుండూరు చెరువు ప్రమాదకర స్థాయికి చేరుకుంది. కొండపి, టంగుటూరు, కొత్తపట్నం మండలాల్లో పలు వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు రూరల్, నాగులుప్పలపాడుల్లో తీరప్రాంతం ప్రజలు ఈదురు గాలులతో ఇబ్బందులు పడ్డారు. మత్స్యకారులు వేటను నిలిపేశారు. బోట్లను తీరానికి చేర్చారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులు, నదులు, వాగులు, చప్టాల వద్ద రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేశారు.

అత్యధిక వర్షం.. (మి.మీలో)

టంగుటూరు 137	జరుగుమల్లి 103	కొండపి 101.4
సీఎస్‌పురం : 86.4	తాళ్లూరు : 85	
సింగరాయకొండ : 83.4		

సాక్షిప్రతినిధి ఒంగోలు/ఒంగోలు అర్బన్/ఒంగోలు సిటీ: వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వాయుగుండం ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆది, సోమవారాల్లో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తీరం వెంట 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. జిల్లాలో లోతట్టు ప్రాంతాలు, ఆకస్మిక వరదలు వచ్చే ప్రాంతాలకు చెందిన ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆకస్మిక వరదలు వచ్చే ప్రాంతాల్లో మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. తీరం వెంట మెరైన్ పోలీసుల గస్తీని మరింత పెంచి ఎవరూ సముద్ర తీరానికి రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. భారీ వర్షాలకు జిల్లాలో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో పాటు పలు మండలాల్లో ఆవాస ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి ఆశ్రయం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 35 పునరావాస కేంద్రాలను గుర్తించగా వాటిలో 5 కేంద్రాలను ప్రారంభించి అక్కడ ముంపు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా తరలించి ఆశ్రయం కల్పిస్తున్నారు. కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ, నాగులుప్పలపాడు మండలాల్లో 5 పునరావాస కేంద్రాల్లో 64 కుటుంబాలకు చెందిన 222 మంది ఆశ్రయం పొందుతున్నారు. వెలిగండ్ల, పామూరు, ఎన్‌జీపాడు మండలాల్లోని 5 గ్రామాల్లో 125 హెక్టార్లలో సజ్జ పంట పాక్షికంగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు.

తెగిన చదలవాడ చెరువు కట్ట

నాగులుప్పలపాడు: చదలవాడ రామన్నచెరువు కట్ట తెగి నీళ్లన్నీ 216 జాతీయ రహదారిపైకి చేరి గ్రామంలోకి వెళ్లాయి. నీరంతా జాతీయ రహదారిపై చేరడంతో వాహన రాకపోకలు కొద్ది సేపు పూర్తిగా నిలిచిపోయాయి. చెరువులోని నీళ్లు గ్రామంలోకి వెళ్లకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టి నీటిని మరో మార్గం ద్వారా బయటకు పంపించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా చదలవాడ గ్రామానికి వెళ్లి చెరువు కట్టను పరిశీలించి అత్యవసరంగా ఇసుక బస్తాలతో నింపి నీటిని నిలువరించాలని ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెరువు పూర్తిగా ఆక్రమణలకు గురైందని, చెరువు కట్టను పటిష్టం చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. తీవ్ర వర్షాలు కురిసిన ప్రతి సారి గ్రామస్తులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పూర్తి స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ కూడా చదలవాడ చెరువు కట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించి వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మహాలక్ష్మి, రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్, ఎస్సై శ్రీకాంత్ బాబు ఉన్నారు.

ప్రమాదకరంగా ఉప్పుగుండూరు చెరువు

నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు చెరువు వర్షం నీటితో పూర్తిగా నిండిపోయి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. అప్రమత్తమైన అధికారులు, ప్రజాప్రతినిధులు ముందు జాగ్రత్త చర్యగా చెరువు కట్టకు గండికొట్టి నాగన్నవాగుకు నీటిని విడుదల చేయడంతో ప్రమాదం తప్పింది.

నిలిచిన రాకపోకలు

కొండపి మండలంలోని కొండపి, అనకర్లపూడి మధ్య అట్లేరు వాగు, అనకర్లపూడి, మొద్దులూరు గ్రామాల మధ్య ముసివాగు ఉప్పొంగడంతో కొండపి, ఒంగోలు వయా సంతనూతలపాడు మధ్య రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. అలాగే చిన్న కల్లగుంట తాటాకులపాలెం గ్రామాల మధ్య కొయ్యల వాగు పొంగడంతో కొండపి–పొదిలి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కే ఉప్పలపాడు, టంగుటూరు మండలం బి.నిడమనూరు గ్రామాల మధ్య ముసి ఉప్పొంగడంతో కొండపి, ఒంగోలు వయా మర్లపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. టంగుటూరు, ఆలకూరపాడు గ్రామాల మధ్య నేల చప్టాలపై వర్షపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆలకూరపాడు, మడనూరు మధ్య మూసి నది ఉధృతంగా పొంగటంతో ప్రజలు అటు వైపు పోకుండా వీఆర్వో, పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. టంగుటూరు–అనంతవరం మధ్య ఉన్న పంట పొలాల్లో వర్షపు నీరు రోడ్డు మీదకు రావటంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పొన్నలూరు మండలం వెల్లటూరు, వేంపాడు మధ్య రాళ్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పాటు పెదవెంకన్నపాలెం వద్ద పంది వాగు, కల్లూరివారిపాలెం, ఉప్పలదిన్నె వద్ద పాలేరు కూడా నాలుగు అడుగుల ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో కల్లూరివారిపాలెం, కే అగ్రహారం మధ్య, ఉప్పలదిన్నె, కామేపల్లె మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రత్యేక పహారా..

ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉన్న పలు ప్రాంతాలు, చెరువులు, నదులు, వాగులు, చప్టాల వద్ద రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖ సిబ్బందిని సూపర్‌వైజర్‌లుగా నియమించారు. పశ్చిమ ప్రాంతంలో రాచర్ల, అర్ధవీడు, కంభం, దోర్నాల, మార్కాపురం, పెద్దారవీడు, దొనకొండ, ముండ్లమూరు, దర్శి, పొదిలితో పాటు తాళ్లూరు, కురిచేడు, ఒంగోలు, మద్దిపూడి, పొన్నలూరు, టంగుటూరు, కొండపి మండలాల్లోని నీటి వనరుల వద్ద సూపర్‌వైజర్‌లను నియమించారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కంట్రోలు రూములు ఏర్పాటు చేసి పరిస్థితులను పర్యవేక్షించడంతో పాటు ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.

35 పునరావాస కేంద్రాలు:

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో మొత్తం 35 పునరావాస కేంద్రాలను గుర్తించామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రస్తుతం ఒంగోలు, టంగుటూరు, కొత్తపట్నం, సింగరాయకొండ మండలాల్లో ఐదు పునరావాస కేంద్రాలను తెరచి సుమారు 200 మంది ప్రజలకు షెల్టర్ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాను రెడ్ జోన్ గా ప్రకటించినందున జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఓవర్‌ఫ్లో అవుతున్న చప్టాల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కూడా నియమించారన్నారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. అనంతరం కొప్పోలు–కరవది రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద మునిగిపోయిన ముదికొండవాగులో లెవెల్ చప్టాను పరిశీలించి, వరద ఉధృతి తగ్గే వరకు ఎవరినీ వెళ్లనీయవద్దని అధికారులను ఆదేశించారు.



ఒంగోలు పాతమార్కెట్ సెంటర్‌లో ప్రవహిస్తున్న వర్షం నీరు

నేడు పాఠశాలలకు సెలవు

17వ తేదీ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో అంగన్‌వాడీ, పాఠశాలలు, కాలేజీలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు కూడా ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

- మార్కాపురం మండలం గోగులదిన్నె గ్రామంలో పెంకుటిల్లు బుధవారం కుప్పకూలింది. ఇంట్లో వంట చేస్తున్న వృద్ధురాలు అంబడిపూడి పిచ్చమ్మ పై పెంకులు పడటంతో స్వల్ప గాయాలయ్యాయి.
- కనిగిరి నియోజకవర్గంలోని పామూరు మండలంలో 1300 ఎకరాల్లో మినుము మొలకదశలో ఉండగా ఇప్పుడు పడిన వర్షాలకు పంట దెబ్బ తింటుందని అధికారులు చెబుతున్నారు.
- దర్శి నియోజకవర్గంలో బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోకాలు లోతు నీరు చేరింది.
- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సంబంధించి 39 కాల్స్ వచ్చాయి. 10 కాల్స్ ప్రాసెస్‌లో ఉన్నాయి.
- కారుమంచి లో 2, పాత సింగరాయకొండలో 1, ఉలిచిలో 1 చొప్పున మొత్తం 4 కచ్చా ఇళ్లు దెబ్బతిన్నాయి.
- పొదిలి మండలంలో ఒక గేదె, మద్దిపాడు మండలంలో ఒక ఎద్దు చనిపోయింది.

ఉధృతంగా సంకువారిగుంట

కొత్తపట్నం: సంకువారిగుంట సమీపంలో ఉన్న పెద్దవాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న సంకువారి గుంట గ్రామం జలదిగ్బంధంలో ఉంది. వాగు ఉధృతంగా ప్రవహించడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలిచిపోయాయి. ప్రభుత్వం వారికి ఎటువంటి సహాయం సహకారం అందించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. అనారోగ్యంగా ఉన్న వారిని తీసుకెళ్లాలంటే కష్టతరంగా మారింది. ట్రాక్టర్ సహాయంతో అతి కష్టం మీద తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

- తెగిన చదలవాడ రామన్నచెరువు కట్ట
- ప్రమాదకరంగా ఉప్పుగుండూరు చెరువు
- ఉధృతంగా సంకువారిగుంట వాగు
- పొంగిన అట్లేరు, ముసి, కొయ్యల వాగులు
- పొంగిపొర్లుతున్న రాళ్లవాగు, పందివాగు, పాలేరు

బుధవారం వర్షపాతం ఇలా...

జిల్లా వ్యాప్తంగా బుధవారం సరాసరి 46 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా టంగుటూరు మండలంలో 137.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, జరుగుమల్లి 103.2, కొండపి 101.4, ఒంగోలులో 54.8, నాగులుప్పలపాడు 44.2, కొత్తపట్నం 61.4, చీమకుర్తి 61.2, మద్దిపాడు 41.8, సంతనూతలపాడు 37.2, సింగరాయకొండ 83.4, తాళ్లూరు 85, ముండ్లమూరు 22.4, కనిగిరి 40.8, హెచ్‌ఎంపాడు 68.2, వెలిగండ్ల 31.2, పామూరు 61.4, సీఎస్‌పురం 86.4, పీసీపల్లి 58.8, పొన్నలూరు 78.4, మర్రిపూడి 68.8, పొదిలి 21.4, కొనకనమిట్ల 26.2, దర్శి 35, దొనకొండ 27.2, కురిచేడు 26.8, మార్కాపురం 22.8, తర్లుపాడు 21.8, దోర్నాల 35.6, పెద్దారవీడు 17.2, యర్రగొండపాలెం 15.6, త్రిపురాంతకం 13.4, పుల్లలచెరువు 37.2, గిద్దలూరు 59.4, రాచర్ల 48, కొమరోలు 46.6, బేస్తవారిపేట 32.8, కంభం 12.2, అర్ధవీడు 19.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



చదలవాడ చెరువుకు గండిపడి జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు



టంగుటూరు-అనంతవరం మధ్య రోడ్డులో నిలిచిన నీరు



చిన్నకల్లగుంట-తాటాకులపాలెం మధ్య పొంగిన కొయ్యల వాగు



పామూరు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నాచవాగు

అడుగడుగునా కిక్కు

- ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు
- ఒంగోలులో పక్క పక్కనే మెడికల్ షాపు, మద్యం దుకాణం
- జోరుగా వర్షం కురుస్తున్నా మద్యం దుకాణాలు ప్రారంభించిన వైనం
- అధిక ధరలతో పాత స్టాకు విక్రయాలు

ఒంగోలు టౌన్: కొత్త మద్యం దుకాణాల తలుపులు తెరుచుకున్నాయి. ఒకవైపు జోరుగా వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా కొందరు వ్యాపారులు బుధవారం నుంచే దుకాణాలు ప్రారంభించారు. మరి కొందరు వ్యాపారులు గురువారం ప్రారంభం అని ఫ్లెక్సీలు పెట్టినా దుకాణాలు మాత్రం తెరచి ఉంచి వ్యాపారాలు చేసుకుంటున్నారు. లాటరీకి ముందే కొందరు దుకాణాలను అద్దెకు తీసుకొని సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు పాత దుకాణాలనే కొనసాగిస్తున్నారు. దీంతో దుకాణాల యజమానులు రెట్టింపు అద్దె డిమాండ్ చేస్తున్నా లెక్క చేయకుండా అగ్రిమెంటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఒంగోలులో ఒక మద్యం దుకాణానికి నెలకు రూ.60 వేల వరకు అద్దె చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నట్లు చెప్పుకుంటున్నారు.



ఒంగోలులో మెడికల్ షాపు పక్కనే ఉన్న మద్యం షాపు

నిబంధనలు లెక్కచేయకుండా దుకాణాలు:

నిజానికి పాఠశాలలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు, వైద్యశాలలకు 100 మీటర్ల దూరంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హైవేల పై దుకాణాలు ఏర్పాటు చేయరాదని నిబంధనలున్నాయి. అయితే ఎవరూ ఈ నిబంధనలను లెక్క చేసే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో అనేక చోట్ల గుడి, బడి అని చూడకుండానే మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒంగోలు-కర్నూలు హైవేలో నగరంలోకి ప్రవేశించే బస్టాప్ దగ్గర ఒక మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దానికి పక్కనే మెడికల్ షాపు ఉంది. ఇక్కడికి మహిళలు, వృద్ధులు మందుల కోసం వస్తుంటారు. అంతేకాకుండా మార్కాపురం, గుంటూరు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులన్నీ అక్కడ మూలలో ప్యాసింజర్లను దించుతారు. సరిగ్గా ఈ మూలలోనే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడంతో మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంటుందని మహిళా సంఘాలు విమర్శిస్తున్నాయి. గతంలో ఎవరైనా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయాలంటే దరఖాస్తులో దుకాణం చిరునామా కూడా పేర్కొనాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం మీ ఇష్టం వచ్చిన చోట దుకాణం పెట్టుకోవచ్చంటూ బంపర్ ఆఫర్ ఇచ్చింది. దాంతో గుడి, బడి సంగతి పట్టించుకోకుండా వ్యాపారులు మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు మౌనం పాటించడం వెనక ఉద్దేశం ఏమిటో జవాబు చెప్పాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎలైట్‌లో రూ.1.65 కోట్లు చేతివాటం

- ఎక్సైజ్ కానిస్టేబుల్ నొక్కేశాడని ఆరోపిస్తున్న సిబ్బంది
- ప్రభుత్వం మారగానే నిర్వాకం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని వైనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఎక్సైజ్ శాఖలో దొంగలు పడ్డారు. కోట్ల రూపాయలకు కన్నం వేశారు. సిబ్బంది ఫిర్యాదుతో లోగుట్టు బయట పడడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిన్నటి వరకు ప్రభుత్వం ఆధీనంలో మద్యం దుకాణాలు నిర్వహించడం తెలిసిందే. మద్యం దుకాణాల నిర్వహణకు గాను ఒక సూపర్‌వైజర్, మరో ఇద్దరు సేల్స్‌మెన్‌లను నియమించింది. దుకాణంలో మద్యాన్ని స్కాన్ చేయడం ద్వారా విక్రయించేవారు. దాంతో ఏ రోజు ఆదాయం ఆరోజే లెక్కతేలేది. వచ్చిన ఆదాయాన్ని మరుసటి రోజు బ్యాంకు ద్వారా ప్రభుత్వానికి చెల్లించేవారు. అయితే ఇటీవల రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒంగోలులో మంగమ్మ కాలేజి సమీపంలో ఒక మాల్, మంగమూరు జంక్షన్ సమీపంలో మరో మాల్ ఉంది. ఒంగోలులో పనిచేసే ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ ఈ ఎలైట్ వసూళ్ల పై కన్నేసినట్లు తెలిసింది. ఆయనకు అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండడంతో అనుకున్న పని సులువుగా అయిపోయింది. తన పలుకుబడిని ఉపయోగించిన ఆయన అక్కడ పనిచేసే సిబ్బందిని లోబరుచుకున్నాడు. గత కొద్ది రోజులుగా స్కాన్ చేయకుండానే సరుకు విక్రయించడం మొదలు పెట్టాడు. వచ్చిన సొమ్ము వచ్చినట్లు జేబులో వేసుకోవడంతో అక్కడ ఉన్న సిబ్బందికి అనుమానం వచ్చింది. అప్పటికే రూ.1.65 కోట్లు నొక్కేశాడని తెలుసుకున్న సిబ్బంది గుండెలు గుబేల్ మన్నాయి. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తూ వచ్చిన జీతాలతో జీవితాలను నడుపుకుంటున్న సిబ్బందిలో భయం పట్టుకుంది. అటు తిరిగి ఇటు తిరిగి చివరికి తమను బలి చేస్తారని భయపడి పోయిన సిబ్బంది ఈ నొక్కుడు కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. దాంతో ఒంగోలులో తెలిసిన న్యాయవాదుల సలహా తీసుకున్నారు. వారిచ్చిన సలహా మేరకు ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిసి ఎక్సైజ్ కానిస్టేబుల్ చేతివాటంపై ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన తాలుకా పోలీసు స్టేషన్‌కు రిఫర్ చేశారు. వారు సీఐ అజయ్ కుమార్‌ను కలిశారు. అయితే శాఖాపరంగా ఫిర్యాదు చేయకుండా తానేమీ చేయలేనని ఆయన చెప్పినట్లు సమాచారం. ఈ విషయం గురించి ఎక్సైజ్ అధికారులు ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయడం కానీ, కానిస్టేబుల్‌పై విచారణకు ఆదేశించడం కానీ, ఇతరత్రా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు కానిస్టేబుల్‌కు అధికార పార్టీ అండదండలు ఉండడం వల్లనే అటు ఎక్సైజ్ అధికారులు కానీ, ఇటు పోలీసు అధికారులు కానీ తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ కానిస్టేబుల్ ఒక్కడే కాకుండా మరో ముగ్గురు కానిస్టేబుళ్లకు కూడా ఈ నొక్కుడులో ప్రత్యక్ష ప్రమేయం ఉందని సమాచారం. ఇంత పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడడంలో ఉన్నతాధికారుల ప్రోద్బలం కూడా ఉండవచ్చని వినిపిస్తోంది. నిష్పక్షపాతంగా విచారణ జరిగితే కానీ అసలు నిజాలు బయటకు రావు. ఈ చేతివాటంలో చిరుద్యోగులను బలిచ్చే కార్యక్రమానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

వర్షానికి కూలిన పెంకుటిల్లు
– వృద్ధురాలికి గాయాలు



కూలిపోయిన పెంకుటిల్లు

మార్కాపురం రూరల్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మార్కాపురం మండలంలోని గోగులదిన్నె గ్రామంలో అంబడిపూడి పిచ్చమ్మకు చెందిన పెంకుటిల్లు కూలింది. వర్షానికి నాని ఒక్కసారిగా కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న పిచ్చమ్మకు గాయాలయ్యాయి. ఇల్లు కూలిపోవడంతో పిచ్చమ్మ తీవ్ర ఆవేదనకు గురైంది. రెక్కాడితేకానీ డొక్కాడని పరిస్థితిలో ఎక్కడ తలదాచుకోవాలని రోదిస్తోంది. అధికారులు స్పందించి ఆమెకు సాయం చేయాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

గ్రానైట్ శ్లాబ్స్ తరలిస్తున్న లారీల పట్టివేత

ఒంగోలు సిటీ: గ్రానైట్ స్లాబ్స్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను జిల్లా గనుల శాఖ విజిలెన్స్ బృందం బుధవారం పట్టుకున్నట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా డీడీ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ లారీలు బల్లికురవ, గురిజేపల్లి ప్రాంత గ్రానైట్ శ్లాబ్స్ యూనిట్స్ నుంచి రవాణా చేస్తున్నట్లు ప్రాథమింగా గుర్తించామన్నారు. ప్రభుత్వానికి సీనరేజ్, ఇతర పన్నులు చెల్లించకుండా అక్రమంగా చెన్నై పోర్టుకు తరలిస్తున్నారన్నారు. అక్రమంగా తరలిస్తున్న వారి వివరాలు సేకరించి వారిపైచర్యలు తీసుకుంటామని డీడీ హెచ్చరించారు.

ఎరువుల లారీ బోల్తా



లారీని క్రేన్ల సాయంతో బయటకు తీయిస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన మార్కాపురం మండలంలోని నికరంపల్లి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడప నుంచి విజయవాడకు ఎరువుల లోడ్‌తో వెళ్తున్న లారీ.. వర్షానికి అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ల సహాయంతో బోల్తా పడిన లారీని బయటకు తీశారు.

విద్యుదాఘాతంతో యువకుని మృతి



మృతి చెందిన సాయి

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట గ్రామంలో విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కొలచనకోటకు చెందిన పి.సాయి(35) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. గురువారం ఎస్సీ కాలనీలోని ఒక ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి స్తంభం ఎక్కి పనిచేస్తుండగా ఒక్కసారిగా షాక్ తగలడంతో స్తంభం పైనుంచి సిమెంట్ రోడ్డుపై పడిపోయాడు. యువకుడి ఎడమ చేయి కాలిపోగా, తల వెనుక భాగం పగిలి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మద్దిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మందలించాడని ఆత్మహత్యాయత్నం

మార్కాపురం: భర్త మందలించాడన్న కారణంతో క్షణికావేశంలో ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం ఆమె స్థానిక జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. స్థానిక కొండారెడ్డి కాలనీలో నివాసముండే డి.జ్యోతిపై భర్త మల్లికార్జున్ మంగళవారం రాత్రి మందలించాడు. దానిని జీర్ణించుకోలేక ఆమె నిద్రమాత్రలు మింగింది. కుటుంబ సభ్యులు గమనించి జీజీహెచ్‌కు తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

ఉప్పొంగిన వాగువంకలు



కొండపిలో బార్బర్ షాప్‌లోకి చేరిన నీరు



హనుమంతాపురం కాలనీలోకి చేరిన వరద నీరు



భైరవకోనలో ఉధృతంగా ప్రవహిస్తున్న జలపాతం



పొన్నలూరు మండలం పెదవెంకన్నపాలెం వద్ద పందివాగు ఉధృతి



కొండపి: అనకర్లపూడి-మద్దులూరు మధ్య ముసి ఉధృతి



పామూరు మండలం గోపాలపురంలో నీట మునిగిన ప్రభుత్వ పాఠశాల



పామూరులో సచివాలయ సముదాయం చుట్టూ చేరిన నీరు



కొమరోలు: బాదినేనిపల్లె వద్ద ఉప్పొంగిన పులి వాగు

వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. భైరవకోన జలపాతం ఉప్పొంగింది. జలపాతాన్ని కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ మంజునాథరెడ్డి, సీఐ ఎం. భీమానాయక్, ఎస్సై ఆర్.సుమన్ సందర్శించారు. - సాక్షి నెట్‌వర్క్



టంగుటూరులో రైల్వే అండర్‌పాస్ మార్గంలో భారీగా నీరు



ఒంగోలులో జలమయమైన గాంధీ రోడ్డు



చదలవాడ చెరువుకు గండిపడి నీట మునిగిన హైవేను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కబ్జాకోరుడు.. కలియుగ గోపాలుడు!

- అద్దె భవనంలో నడుస్తున్న దర్శి విద్యుత్ శాఖ కార్యాలయం
- ఏకంగా ఆ భవనంపైనే కన్నేసిన విద్యుత్ శాఖ జేఏఓ వేణుగోపాల్
- దొంగ పత్రాలతో ఇంటిని కాజేందుకు పక్కాగా స్కెచ్
- లాయర్ నోటీస్‌తో ఉలిక్కిపడిన బాధితుడు రవికృష్ణారెడ్డి
- విద్యుత్ శాఖ కార్యాలయానికి తాళం.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు
- జేఏఓ నిర్వాకంపై డీఎస్పీకి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు

దర్శి:

ద్వాపర యుగంలో గోపాలుడు పక్కిళ్లలో వెన్న దొంగిలించిన వైనాన్ని కథలు కథలుగా వినే ఉంటారు! దర్శిలో వేణుగోపాల నామదేయుడు ఏకంగా ఇతరుల ఇంటినే కాజేసేందుకు యత్నించాడు. తనది కాని ఆస్తిని స్వాధీనం చేసుకునేందుకు పక్కాగా పథకం రచించి అమలుచేశాడు. వివరాల్లోకి వెళ్తే.. దర్శి పట్టణంలోని చలమారెడ్డి బజారులో నివాసముండే దేవిరెడ్డి రవికృష్ణారెడ్డి తన ఇంటిని ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేదీన విద్యుత్ శాఖ కార్యాలయానికి అద్దెకు ఇచ్చాడు. అగ్రిమెంట్ సమయంలో ఇంటి కొలతల ప్రకారం అద్దె నిర్ణయించారు. రెండు నెలల తర్వాత ఇంటి అద్దె విషయమై విద్యుత్ ఏడీ పిచ్చయ్యను రవికృష్ణారెడ్డి సంప్రదించగా జేఏఓ నాదెండ్ల వేణుగోపాల్‌ను కలవాలని సూచించారు. అద్దె చెల్లించాలంటే ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇవ్వాలని నమ్మించి తీసుకుని కొంత కాలంపాటు తన వద్ద ఉంచుకుని కలర్ జిరాక్స్ తీయించుకున్నాడు. కృష్ణారెడ్డి గట్టిగా అడగటంతో ఒరిజనల్ డాక్యుమెంట్లు తిరిగి ఇచ్చాడు. వారం తర్వాత కృష్ణారెడ్డిని కార్యాలయానికి పిలిపించి త్వరలో అద్దె డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాకే జమవుతాయని చెప్పి అక్నాలెడ్జ్‌మెంట్ పేరుతో స్టాంపులు అంటించిన వైట్ పేపర్లు ముందుపెట్టాడు. జనవరి నుంచి డిసెంబర్ వరకు సరిపడేలా కావాలని సంతకాలు చేయించాడు. అయినా అద్దె డబ్బు అకౌంట్‌లో జమ కాకపోవడంతో రవికృష్ణారెడ్డి విద్యుత్ కార్యాలయానికి వెళ్లి విచారించగా వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని వేణుగోపాల్ బదులిచ్చాడు. ఈ క్రమంలో గత నెల 3వ తేదీన రవికృష్ణారెడ్డికి లాయర్ నోటీసులు అందాయి. రవికృష్ణారెడ్డికి ఏప్రిల్ నెలలో 4 పర్యాయాలు కోటి





విద్యుత్ శాఖ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

రూపాయలు చెల్లించి దర్శి సర్వే నంబర్ 789/1లోని 15 సెంట్ల స్థలానికి స్వాధీన అగ్రిమెంట్ రాయించుకున్నట్లు.. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేసేందుకు రానట్టు అడ్వకేట్ నాగిశెట్టి మోహన్ దాస్ ద్వారా వేణుగోపాల్ నోటీసు పంపాడు. దీనిపై ఇప్పటికే విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన రవికృష్ణారెడ్డి.. బుధవారం డీఎస్పీ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆ తర్వాత విద్యుత్ శాఖ కార్యాలయానికి తాళం వేశాడు. అద్దె బకాయి చెల్లించడమే కాకుండా, సమస్యను పరిష్కరించి జేఏఓపై చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పాడు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- మృతుడు ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్

దర్శి: అప్పుల బాధ తాళలేక ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ సాగర్ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన దర్శి మండలంలోని కొత్తపాలెం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్త వెంకటాపురం గ్రామానికి చెందిన జింకల హరిచంద్రారెడ్డి(40) పొదిలిలో ముత్తూట్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల కోసం పొదిలి, దర్శిలో ఎక్కువ మంది వద్ద అప్పు చేశాడు. కొంత కాలంగా అప్పు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేస్తుండటంతో తీర్చే మార్గం కానరాక మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎస్సై పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



హరిచంద్రారెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సనాతన ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలి




మాట్లాడుతున్న గుజ్జుల ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: ప్రజల సమస్యలను తీర్చి సంక్షేమ పథకాలను అందిస్తామంటూ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక సనాతన ధర్మం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్న సనాతన ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని అఖిల భారత యువజన సమాఖ్య పూర్వ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో బుధవారం జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా కనీసం ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలను ఏమార్చే కుయుక్తులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. యువతకు ఇస్తానన్న ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగ భృతి, డీఎస్సీ లాంటి హామీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోలను తుంగలోకి తొక్కారన్నారు.


రోజురోజుకూ సైన్స్ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కులమతాల పేరుతో ప్రజలను మభ్యపెట్టేందుకు పాలకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల్లో గెలుపు కోసం సమాజంలోని అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు కోరారు. కార్యక్రమంలో యువజన సంఘ నాయకులు పి. ప్రభాకర్, పి.సుబ్బారావు, నాగరాజు ఫ్రాన్సిస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ పేరుతో కక్ష సాధింపు

- గిద్దలూరులో చిరు వ్యాపారుల దుకాణాలు కూల్చివేత
- కేవలం ఇద్దరి దుకాణాలే తొలగించడంపై విమర్శలు



అధికారులతో మాట్లాడుతున్న గడ్డం తిరుపతి,



రోదిస్తున్న అనూష

గిద్దలూరు రూరల్: కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు కనిగిరి, పొదిలి, టంగుటూరు, మార్కాపురంలో కుట్ర పూరితంగా వ్యవహరించి దుకాణాలు, ఇళ్ల కూల్చివేతకు పూనుకున్న టీడీపీ నాయకులు బుధవారం గిద్దలూరులోనూ అధికార యంత్రాంగాన్ని ఉసిగొల్పి అదే పనిచేశారు. ఆక్రమణల తొలగింపు పేరుతో ఇద్దరు చిరు వ్యాపారుల జీవనోపాధిపై వేటువేశారు. వివరాల్లోకి వెళ్తే.. గిద్దలూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కుమ్మరాంకట్ట సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా సుమారు 100 మందికి పైగా చిరువ్యాపారులు నిర్వహించుకుంటున్నారు. అయితే తహసీల్దార్ కార్యాలయం ముందు భాగంలో ఉన్న గడ్డం తిరుపతి యాదవ్, అనూష అనే ఇద్దరు చిరు వ్యాపారులపై టీడీపీ నేతలు కక్ష పెంచుకున్నారు. బుధవారం కమిషనర్ డి.వెంకటదాసు, సీఐ కె.సురేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది బుధవారం ఆ దుకాణాలను కూల్చారు. దీంతో బాధితులు అక్కడికి చేరుకుని అధికారులను నిలదీశారు. ఎవరికీ ఇబ్బంది లేకపోయినా దుకాణాలు కూల్చడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఎంతో మంది వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే కేవలం తమ ఇద్దరి దుకాణాలే అడ్డం వచ్చాయా అంటూ ప్రశ్నించారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా దౌర్జన్యంగా దుకాణాలు కూల్చడాన్ని ఆక్షేపించారు. 23 ఏళ్ల నుంచి హోటల్ నిర్వహించుకుంటున్న తనను రోడ్డున పడేశారంటూ అనూష బోరున విలపించింది. గడ్డం తిరుపతి యాదవ్ గత పదేళ్లుగా జిరాక్స్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ విషయమై కమిషనర్ వెంకటదాసును వివరణ కోరగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు మొత్తం 32 సెంటర్లను గుర్తించామని అందులో భాగంగా ముందుగా వీరిద్దరి ఆక్రమణలు తొలగించామని ముక్తాయించారు.

డ్వాక్రా మహిళల నిధులు మాయం



కార్యాలయంలో విచారణ చేస్తున్న ఏరియా కో ఆర్డినేటర్

జరుగుమల్లి(టంగుటూరు): డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాల నగదు బ్యాంకులకు చెల్లించకుండా సొంత అవసరాలకు వాడుకుంది. ఈ తంతు ఆరు నెలలుగా జరుగుతున్నా డ్వాక్రా మహిళలు వీఓఏను గట్టిగా అడగటంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండపి ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ జరుగుమల్లి ఏపీఓ కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కొండపి ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ్ మాట్లాడుతూ మొత్తం ఐదు గ్రూపులకు చెందిన మహిళలు రూ. 20 లక్షల రుణం తీసుకున్నారు. ప్రతి నెల స్థానిక కెనరా బ్యాంకుకు నగదు నెల నెలా చెల్లించాల్సి ఉండగా స్థానిక వీఓఏ జ్యోతికి మహిళా సంఘాల సభ్యులు రుణాల నగదు బ్యాంకులో చెల్లించమని ఇస్తున్నారు. అయితే వీఓఏ నగదును బ్యాంకులో చెల్లించకుండా సొంత అవసరాలకు వినియోగించుకుంది. ఈ క్రమంలో నగదు చెల్లించి రశీదు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి డ్వాక్రా మహిళలు 50 మంది పైగా జరుగుమల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ నిమిత్తం కొండపి ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, లీగల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం జయరాజు, సీసీల విచారణలో వీఓఏ జ్యోతి రూ.6 లక్షలు వాడుకున్నట్లు తెలిసింది. అయితే డిసెంబర్ నాటికి నగదు చెల్లిస్తామని ఒప్పందం చేసుకుంది. నగదు చెల్లించకుంటే మహిళా సమాఖ్య చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు.